క్లుప్తంగా

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అష్టోత్తర శతనామాలతో పూజలు చేసి, ఉద్యాపనులు, మహానివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీఐ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని పలు కేంద్రాలను ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌తో కలిసి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి సూచనలిచ్చారు.

ఫ్యామిలీ డాక్టరుతో ప్రజలకు మేలు



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

లావేరు: ఫ్యామిలీ డాక్టరు విధానంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి దేశెట్టి తిరుపతిరావు అన్నారు. రావివలస గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు ప్రక్రియలో భాగంగా వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చిన వారికి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టరు మణిభూషణ్, సచివాలయం ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

జి.సిగడాం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలని రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లా ఆనంద్‌పాత్రుడు అన్నారు. గంగన్నదొరపాలెంలో నగరాల సామాజికవర్గానికి చెందిన చిన్నారులతో కోలాట, నృత్యప్రదర్శన పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నగరాల కులస్తుల కోసం ప్రత్యేక నిధులను కేటాయించారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తొత్తడి రామారావు, కనకరావు, రమణ, అప్పారావు, సూర్యనారాయణ ఉన్నారు.

పెద్ద చెరువు గర్భంలో సర్వే



చెరువు గర్భంలో సర్వే చేస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ధర్మవరం పెద్దచెరువు గర్భంలో సర్వేను అధికారులు శుక్రవారం ప్రారంభించారు. మండల సర్వేయర్ తమ్మయ్య స్వామి, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు. సర్వే నంబర్ 128లో పరిధిలో 187 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం ఉంది. అయితే కొందరు చెరువు గర్భాన్ని పొలాలుగా మార్చి అక్రమంగా సాగు చేస్తున్నారు. ముందుగా హద్దులు నిర్ణయించటంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. హద్దులు నిర్ణయించి అనంతరం ఆక్రమణలు తొలగించనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులో పనులు కల్పించాలని స్థానికుల విజ్ఞప్తిని అధికారులు పరిశీలిస్తున్నారు.

సజ్జలను కలిసిన డాక్టర్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వరుణ్



సజ్జల రామకృష్ణారెడ్డితో చింతాడ వరుణ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్ శుక్రవారం అమరావతిలో ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో డాక్టర్స్‌సెల్ విభాగం మరింత పటిష్టం చేయాలని, నియోజకవర్గాలవారీగా కమిటీలు వేయాలని సజ్జల సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపులో కీలకపాత్ర పోషించాలన్నారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం



ఎచ్చెర్ల క్యాంపస్: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ప్రజాప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సేవకులకు సన్మానాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో వలంటీర్లను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. దోమాం గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్లను ఎంపీపీ మొదలవలస చిరంజీవి సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు సంధానకర్తలుగా వలంటీర్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు మురళీధర్‌బాబా, సర్పంచ్ బోర సరోజని, నాయకులు బెండు రామారావు, బోర గన్నయ్య పాల్గొన్నారు.



జి.సిగడాం: వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

జి.సిగడాం: సంతవురిటి గ్రామ సచివాలయంలో సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వాండ్రంగి అరుణకుమారి, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావులు గ్రామ వలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు. మాజీ సర్పంచ్ బత్తుల సన్యాసిరావు, చందనాల గణపతి, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లల శివకుమార్, చందనాల రంగరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, రాంజీ, లక్ష్మీనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

రణస్థలం: దేరసాం గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లను సర్పంచ్ మీసాల రామారావు సత్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, గ్రామ నాయకులు ఉన్నారు.

వలంటీర్ల సేవ వెలకట్టలేనిది

గార: వలంటీర్ల సేవ వెలకట్టలేనిదని, ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శుక్రవారం కె.మత్స్యలేశం సచివాలయం వద్ద కె.మత్స్యలేశం, కళింగపట్నం, బందరువానిపేట వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలను లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్లు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.లలిత, బి.ఎర్రన్న, తాన్నె అప్పలరాజు, గనగళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్ల సేవలు అభినందనీయమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. శ్రీకాకుళం నగరంలో కాకివీధి సచివాలయం పరిధిలో వలంటీర్లకు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎంఏ బేగ్, సింగిరెడ్డి నాగ్, ఇంజద్ బాషా, గంధం సాగర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం



గార: వలంటీరును సన్మానిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వలంటీర్లను సన్మానిస్తున్న ఎం.వి.పద్మావతి

సంక్షేమం వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- చీడిపేటలో రెండు వందల రోజుల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: సంక్షేమాన్ని వివరిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ వాండ్రంగి సచివాలయం పరిధిలోని చీడిపేట, బీసీ, ఎస్సీ కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బడుగు, బలహీన వర్గాలను గుర్తించి అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని చేరువ చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ప్రతి పథకం పేదలకు అందాలని, అర్హులై ఉండి ఏకారణం చేతనైనా పథకాలు అందకపోతే సంబంధిత గ్రామ వలంటీర్, సచివాలయం సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. సీఎం జగన్‌కు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులాంటివన్నారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. 250 గృహాలకు వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముందుగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నియోజకవర్గంలో రెండు వందల రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, స్థానిక సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, వ్యవసాయసలహా మండలి చైర్మన్ మక్క వెంకటిసాయి, ఈ గోవిందరావు, మండల మహిళా కన్వీనర్ కంది రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీలు తోలేటి వెంకటరావు, కర్రి వైకుంఠేశ్వరరావు, ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈలు బగాది భాగ్యలక్ష్మి, చీర రాము, ఏపీవో చోళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వడగ గౌరీశంకరావు, పార్టీ నాయకులు పేడాడ శ్రీరామమూర్తి, సనపల త్రినాథరావు, పిల్లల శివకుమార్, నల్లి తవిటినాయుడు, వాన వెంకటరమణ, టంకాల సత్యనారాయణ, సర్పంచులు చిత్తిరి మోహన్, బుడారి లక్ష్మణరావు, వడిశ మహేశ్వరావు, భూపతి సురేషకుమార్, బొద్దూరు సత్తైరాజు, పున్నాన అక్కలనాయుడు, ముద్దాడ గౌరీ, పెద్ది శ్రీనివాసరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌బాబుకు రుణపడి ఉంటా



నా వయసు 87 ఏళ్లు. నాకు ఇద్దరు కొడుకులు. వీరిలో ఒకరు మృతి చెందాడు. మరో కొడుకు అతని కుటుంబ పోషణలో ఉన్నాడు. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నాకు పింఛన్ మంజూరు చేసి ఆదుకున్నాడు. నా పెద్దకొడుకుగా జగన్‌బాబును చూసుకుంటాను. నేను ఆనందంగా జీవిస్తున్నాను. జగన్‌బాబుకు రుణపడి ఉంటా.

– కళ్లేపల్లి సూరమ్మ, చీడిపేట

పల్లెనిద్రతో టీడీపీకి నిద్ర కరువు

- యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



పల్లె నిద్రలో భాగంగా స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పల్లెల్లో నిద్రిస్తున్నానని, ఈ కార్యక్రమం చేస్తున్నంత సేపు టీడీపీ నాయకులకు వారి గ్రామాల్లో నిద్ర కరువైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. బైరివానిపేటలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర నిర్వహించారు. అంతకుముందు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాలను ఒక్క పైసా కూడా లంచం లేకుండా అందుకుంటున్నామని మహిళలు తెలిపారు. గత టీడీపీ పాలనలో రేషన్ కార్డు, పెన్షన్ మంజూరుకు జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇవ్వాల్సి వచ్చేదని ఓ వ్యక్తి యువనేత ముందు ఆవేదన చెందాడు. అనంతరం నిర్వహించిన సభలో రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి దిశగా వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో 95 శాతం మేర హామీలు నెరవేర్చినట్లు తెలిపారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో శ్రీకాకుళం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇచ్చిందన్నారు. ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు ఏకమైనా ముఖ్యమంత్రి పరిపాలనా అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, బైరివానిపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల హక్కులు ఉల్లంఘిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

రణస్థలం: బాలల హక్కులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎస్సై వెంకటరావు అన్నారు. మండలంలోని జె.ఆర్.పురంలో బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా నివారణపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హొటళ్లు, బైక్ మెకానిక్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. 18 ఏళ్లలోపు బాలలను పాఠశాలకు పంపించకుండా అక్రమంగా పనిలో పెట్టి బాల కార్మికులుగా తయారు చేస్తే సంబంధిత షాపుల యాజమానులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆలాగే మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఒక మెకానిక్ స్పేర్ పార్ట్ దుకాణంలో ఒకరు బాల కార్మికుడుగా పని చేస్తున్నట్లు గుర్తించారు. తదుపరి చర్యల నిమిత్తం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మానవ అక్రమ రవాణ విభాగం ఎఎస్సై డి.రమణరావు, చైల్డ్‌లైన్ అధికారిణి మౌనిక ఉన్నారు.

పక్కాగా భూసర్వే

- జేసీ నవీన్



మాట్లాడుతున్న జేసీ నవీన్

ఎచ్చెర్ల క్యాంపస్: జగనన్న, వైఎస్సార్ శాశ్వత భూహక్కు సర్వే ప్రజా భాగస్వామ్యంతో తప్పుల్లేకుండా పక్కాగా జరగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఎచ్చెర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 38 శాతం, ఎచ్చెర్ల మండలంలో 35 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు. సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సర్వేలో తప్పులు చోటు చేసుకుంటన్నాయని అన్నారు. ప్రభుత్వ రికార్డులు, భూముల కేటగిరీలు, స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. భూయజమానుల నుంచి పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తే సమస్యలు ఉండవన్నారు. స్పందనకు వస్తున్న ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, ప్రభుత్వ భూములు, సాగునీటి కాలువల్లో ఆక్రమణలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలన్నను. ప్రస్తుతం సాంకేతిక ప్రగతి విస్తరిస్తున్న నేపథ్యంలో సిబ్బంది సైతం మారుతున్న కాలానుగుణంగా విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. వెబ్ ల్యాండ్, ఆన్‌లైన్ సేవలు, యాప్‌ల వినియోగంపై అవగాహన అవసరమన్నారు. సమావేశంలో తహసీల్దార్ వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: చౌక్‌బజారులోని రోషన్ షావలి దర్గాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో చందనోత్సవం నిర్వహించారు. దర్గాలో చందనం పూడి, చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సలీం సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం గ్రామ సచివాలయం-2 కన్వీనర్ గుదే శారద అత్త ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకుని ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకులు టీకి బ్రహ్మాజీ, పిన్నింటి సత్యంనాయుడు, లుకలాపు అనిల్‌కుమార్, మంత్రి శ్రీను ఉన్నారు.

ధర్మారావుకు ఎన్టీఆర్ పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎక్స్‌రే సంస్థ జర్నలిజం విభాగంలో అరసం అధ్యక్షుడు నల్లి ధర్మారావు ఎన్టీఆర్ పురస్కారం గురువారం ప్రదానం చేసింది. సంస్థ అధ్యక్షుడు కొల్లూరు అధ్యక్షతన జరిగిన సభలో ఐఎన్టీయూసీ నాయకులు మొఖర ఆదిబాబు, యువజన నేత ఎచ్చెర్ల రవికుమార్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితే ధ్యేయం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళా సాధికారితే లక్ష్యంగా సిబ్బంది ముందుకు సాగాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో మెప్మాలో పనిచేస్తున్న రీసోర్సు పర్సన్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయ సంఘాలు బలోపేతం కావాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల నిర్వహణకు మహిళలు ముందుకు రావాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీనివాస్, అధికారులు రాము, జయరాజ్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పోతయ్యవలసలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

లావేరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం డ్రై ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రబలుతాయని అందువలన చెత్తాచెదారాలు ఎక్కడ పడితే అక్కడ వేయరాదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సూచించారు.

సేవలే గుర్తింపునిస్తాయి



శివరామరాజును సన్మానిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని ఎస్పీ జి.ఆర్.రాధిక పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహించిన ఎం.శివరామరాజు కాకినాడ పోలీస్ కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పరిపాలనాధికారిగా నిబద్ధతతో పనిచేసిన వ్యక్తి శివరామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, బాలరాజు, లిల్లీ భాయ్, సీసీ శివకుమార్, పీఆర్వో భాస్కర్, పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



లావేరు: పిల్లలకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి



ఎచ్చెర్ల క్యాంపస్: ఖోఖో ఆటలో చిన్నారులు

లావేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాల్లో రోజుకో కార్యక్రమం కొనసాగుతోంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మురపాక గ్రామంలోని శాఖాగ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్‌తో పాటు పలు ఆటలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో పిల్లలకు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం.నీలమ్మ విజేతలకు బహుమతులు అందజేశారు.

ఎచ్చెర్ల: ప్రతి విద్యార్థి పెద్ద బాలశిక్ష గురించి తెలుసుకోవాలని రిసోర్స్‌పర్సన్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. ధర్మవరం గ్రంథాలయంలో విద్యార్థులకు పెద్దబాల శిక్ష గురించి అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖరరావు, సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖన పోటీలు



శ్రీకాకుళం కల్చరల్: బొమ్మలతో చిన్నారులు



శ్రీకాకుళం అర్బన్: చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు శుక్రవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుధన్‌వాసాయి, ఎం.లక్ష్మీ, బి.రోహిత్‌లు తొలి మూడు స్థానాల్లో నిలవగా రిటైర్డ్ సెట్‌శ్రీ సీఈవో సురంగి మోహనరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉపాధ్యాయులు ఎస్.ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయురాలు రెడ్డి లలిత వేమన శతకంలోని పద్యాలు, తంగి ఎర్రమ్మ జనరల్ నాలెడ్జ్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.వి.జి.ఎస్ శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.భానుమతి, పి.రామ్మోహన్, పి.ఈశ్వరరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పెదపాడు యువత చేరిక



పార్టీలో చేరిన యువకులతో ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పెదపాడు గ్రామానికి చెందిన 70 మంది యువత శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి ధర్మాన క్యాంప్ కార్యాలయంలో యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లోనూ మన ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రవియాదవ్, సింధు, అప్పుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇప్పిలి, కనుగులవానిపేట, కుందువానిపేట, పీజీపేట గ్రామ వాలంటీర్ల సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.